ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ SHANMUKHAVELUGU తెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 224 — సోమవారం 24 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



629 ఏఈ పోస్టుల భర్తీకి సర్వం సిద్ధం..

నిరుద్యోగులకు మంత్రి కీలక సూచన
ఏఈ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు
తీసుకుంటామన్న మంత్రి గొట్టిపాటి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 23)

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ఉద్యోగాల భర్తీ పేరుతో నిరుద్యోగులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్రంగా హెచ్చరించారు. రాష్ట్రంలోని వివిధ విద్యుత్ సంస్థల్లో 629 ఏఈ పోస్టుల భర్తీ కోసం నిర్వహించనున్న పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. అమరావతిలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మంత్రి ఈ వివరాలను ▶మిగతా 2లో

స్వచ్ఛతలో దీటుగా.. ప్రగతిలో మేటిగా

అనకాపల్లిని అగ్రపథంలో నిలుపుతాం
ముఖ్యమంత్రి చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 23)

అనకాపల్లి ఇంతవరకు బెల్లానికి ప్రసిద్ధి చెందిన ప్రాంతం, ఇకపై అన్ని కంపెనీలకు కేంద్రంగా, నాలెడ్జ్ ఎకానమీకి, స్వచ్ఛతకు చిరునామాగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో శనివారం సీఎం పర్యటించారు. గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాడుగుల నియోజకవర్గ తెదేపా శ్రేణులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. హెలిప్యాడ్ నుంచి సభావేదిక వరకు దారిపొడవునా ప్రజలు బారులుదీరి ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. 'గతంలో పెట్టుబడుల విషయంలో అనకాపల్లి జిల్లా వెనుకబడి ఉందని అందరిలో ఆందోళన ఉండేది. ఇప్పుడు విశాఖకు దీటుగా పెట్టుబడులు వస్తున్నాయి. ఆర్సెలార్ మిత్తల్ స్టీల్, డేటా సెంటర్లు, ఫార్మా తదితర పరిశ్రమల ఏర్పాటుతో జిల్లా రూపురేఖలు మారబోతున్నాయి. సమన్వయంతో అనకాపల్లిని రాష్ట్రంలోనే అగ్రగామి జిల్లాగా తీర్చిదిద్దుతామని' చంద్రబాబు తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న చంద్రబాబు : ఎ.కోడూరు గ్రామ పారిశుద్ధ్య నిర్వహణలో కీలకపాత్ర పోషించిన గ్రీన్ అంబాసిడర్లను చంద్రబాబు సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు మాటలు సీఎం చంద్రబాబును ఆకట్టుకున్నాయి. శాలువాలతో వారిని సత్కరించారు.మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, చిత్రంలో ఎంపీలు సీఎం రమేశ్, చింతకాయల విజయ్, మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బండారు ఎ.కోడూరు సభకు భారీగా హాజరైన ప్రజలు ఇటీవల ప్రారంభించిన అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారంగా నిలుస్తూ ఈ ప్రాంత ప్రజల ఆశలు, ఆకాంక్షలకు రెక్కలు తొడుగుతోంది. ప్రభుత్వ కృషి ఫలించి ఏఐ, డేటా సెంటర్లు గురించి చిన్నారులు సైతం మాట్లాడటం సంతోషంగా ఉంది. పోలవరం ప్రాజెక్టు నుంచి వచ్చే నీటితో జిల్లాలోని ప్రతి చెరువూ నింపుతామని సీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర, పురపాలక,మంత్రి నారాయణ, ఎంపీ సీఎం రమేశ్, రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్, ▶మిగతా 2లో



ప్రభుత్వ పాఠశాలలపై కూటమిది అబద్ధాల ప్రచారం

కూటమి ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్ తీవ్ర విమర్శలు
యూడైస్ గణాంకాలతో ప్రభుత్వ వాదనలు అబద్ధమని ఆరోపణ
ప్రభుత్వ పాఠశాలల్లో 5.56 లక్షల మంది విద్యార్థులు తగ్గారని వెల్లడి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 23)

ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యా రంగంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా తగ్గిపోతున్నారని, కూటమి ప్రభుత్వం మాత్రం అబద్ధపు ప్రచారాలు చేసుకుంటోందని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడైస్ ప్లస్ గణాంకాలను ఉటంకిస్తూ సోషల్ మీడియా వేదికగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

రెండు కోట్ల విత్తన బంతులు వెదజల్లాం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 23)

రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం మేర గ్రీన్ కవర్ ఉండాలనే లక్ష్య సాధనలో భాగంగా తలపెట్టిన విత్తన బంతులు (సీడ్ బాల్స్) వెదజల్లే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మూలపాడులోని ▶2లో

మొదటి పేజీ తరువాయి

స్వచ్ఛతలో దీటుగా.. ప్రగతిలో మేటిగా

మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొన్నారు.

హెలిప్యాడ్ నుంచి కారులో వస్తూ ప్రజలకు అభివాదం

వ్యర్థాల నిర్వహణ భేష్

కంపోస్టు గుంతలు చూపుతున్న మహేశ్వరరావు

ఎ.కోడూరు గ్రామంలో నెట్‌జీరో వేస్ట్ విధానాన్ని అమలు చేస్తున్న జె.మహేశ్వరరావు నివాసాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. మహేశ్వరరావు, ఆయన సతీమణి ఇంట్లో చేపడుతున్న పర్యావరణ హిత కార్యక్రమాలను సీఎంకు వివరించారు. ఇంటి నుంచే వెలువడే తడివ్యర్థాలను ప్రత్యేక కంపోస్టు గుంతల్లో వేస్తూ.. అక్కడికక్కడే సేంద్రియ ఎరువుగా మార్చుతున్న విధానాన్ని చూపించారు. ఇంటిలో వాడుక నీటిని రోడ్లపైకి రాకుండా నిర్దేశిత గుంతల్లోకి మళ్లించే విధానాన్ని కూడా పరిశీలించారు. దీంతో కాలనీ రోడ్లపై మురుగు నిల్వ ఉండదని.. లబ్ధిదారులు వివరించారు. ఇంటిపై సౌరవిద్యుత్తు యూనిట్ ఏర్పాటు చేసుకుని ఇండక్షన్ స్టవ్‌ను వినియోగించడం ద్వారా వనరులు సద్వినియోగం చేసుకుంటున్నామని వివరించారు. ఈ కుటుంబంతో సీఎం సెల్ఫీ దిగారు.

చిత్రంతో సీఎంను మెప్పించి..

సీఎం చంద్రబాబుకు మాడుగుల గ్రామానికి చెందిన విద్యార్థి పుట్టా రోహిత్ తాను గీసిన సీఎం చిత్రాన్ని బహూకరించాడు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణానికి రోడ్డు మార్గంలో వస్తున్న చంద్రబాబుకు సంబంధిత చిత్రాన్ని అందజేయగా చంద్రబాబు ఎంతో సంతోషించి దానిపై సంతకం చేశారు. రోహిత్‌ను అభినందించి చక్కగా చదువుకోవాలని సూచించారు. ఈ విద్యార్థి మాడుగుల బాలుర ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. గతంలో జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రతిభచాటి బంగారు పతకం సొంతం చేసుకున్నాడు.

కష్టపడ్డ ప్రతి కార్యకర్తను గుర్తిస్తాం

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న అధినేత

ఈనాడు డిజిటల్, అనకాపల్లి – చీడికాడ, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసిన అన్ని స్థానాల్లోనూ గెలిచేలా కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని తెదేపా నేతలు, కార్యకర్తలకు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మాడుగుల నియోజకవర్గ శ్రేణులతో సీఎం సమావేశమయ్యారు. ‘కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా నిలుస్తుంది. నేతలు, కార్యకర్తలు పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి. క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినపుడు వారికి తగిన గుర్తింపు లభించేలా చూస్తాం. పార్టీకోసం నిరంతరం శ్రమించిన నేతలు, కార్యకర్తలను గుర్తించి వారికి తగిన పదవులు ఇస్తాం. అనంతపురంలో క్లస్టర్ ఇన్‌ఛార్జిగా పనిచేసిన ఓ సాధారణ మహిళకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడమే ఇందుకు ఉదాహరణ. ఇప్పటి నుంచే గ్రామాల్లో ప్రజలతో మమేకమవ్వాలి. కార్యకర్తలంతా ఉమ్మడిగా పనిచేస్తే రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ మనమే అధికారంలోకి వస్తామని’ తెలిపారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, తెదేపా జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు జిల్లాలో పార్టీ కార్యక్రమాల గురించి చంద్రబాబుకు వివరించారు. తదనంతరం ముఖ్యమంత్రి నేతలు, కార్యకర్తలతో సెల్ఫీలు, ఫొటోలు దిగారు.

చెత్తను శుభ్రం చేస్తున్నారు

మాడుగుల నియోజకవర్గాన్ని ఇప్పటికి ముగ్గురే ముఖ్యమంత్రులు సందర్శించారు. సామాన్యుడి ఆదాయం పెరగాలన్న దృక్పథంతో సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. ఒక గొడ్డలి పార్టీ గత ఐదేళ్లలో చెత్త చేసింది. ఆ చెత్తను శుభ్రం చేయడానికి ముఖ్యమంత్రి వచ్చారు. గత ప్రభుత్వంలో జిల్లాకు చేపల దుకాణాలు, మటన్ దుకాణాలు మాత్రమే వచ్చాయి. కానీ.. కూటమి ప్రభుత్వంలో అత్యధిక పరిశ్రమలు వచ్చాయి. పోలవరం నుంచి ఎడమకాలువ నీరు వచ్చిన తర్వాత రైవాడ జలాశయాన్ని రైతులకు అంకితం చేయాలి. నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కు, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరుతున్నా.

బండారు సత్యనారాయణమూర్తి, మాడుగుల ఎమ్మెల్యే

పరిశ్రమలు తెచ్చిన ఘనత చంద్రబాబుదే..

జిల్లాకు భారీ పరిశ్రమలు తెచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుంది. ప్రధాని స్వచ్ఛభారత్ సంకల్పాన్ని.. సీఎం కొనసాగిస్తున్నారు. గత పాలకులు ఆంధ్రప్రదేశ్‌ను చెత్తాంధ్రగా తయారు చేశారు. సీఎం చంద్రబాబు ప్రతినెలా ఆఖరు శనివారం స్వచ్ఛాంధ్రని పరిసరాలు శుభ్రం చేసుకోవాలని దగ్గరుండి చేయిస్తున్నారు. మాడుగుల హల్వా, వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ‘గ్రామీణ ప్రాంతం అధికంగా ఉన్న నియోజకవర్గానికి అనుసంధానంగా జాతీయ రహదారి వేయిస్తే త్వరితగతిన అభివృద్ధి సాధిస్తుంది.

ప్రభుత్వ పాఠశాలలపై కూటమిది అబద్ధాల ప్రచారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని ప్రచారం చేసుకోవడంపై జగన్ మండిపడ్డారు. ఇది వాస్తవమైతే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి కదా? అని ప్రశ్నించారు. కానీ, యూడైస్ గణాంకాల ప్రకారం 2023-24 విద్యా సంవత్సరంతో పోలిస్తే, 2025-26 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 40,50,116 నుంచి 34,93,450కి పడిపోయిందని, అంటే ఏకంగా 5,56,666 మంది విద్యార్థులు తగ్గిపోయారని జగన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45,53,380 నుంచి 48,40,296కు పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య కూడా 45 వేల నుంచి 44,222కు తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు.టీడీపీకి నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ విద్యా సంస్థలతో ఉన్న సంబంధాల కారణంగానే, ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా బలహీనపరుస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. తద్వారా ప్రైవేటు సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం బాటలు వేస్తోందని అనుమానం వ్యక్తం చేశారు.తమ హయాంలో విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని జగన్ గుర్తుచేశారు. ‘మనబడి నాడు-నేడు’ కింద రూ.8,524 కోట్లతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని, విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశామని వివరించారు. ఆంగ్ల మాధ్యమాన్ని ప్రోత్సహిస్తూ టోఫెల్ వంటి అంతర్జాతీయ స్థాయి శిక్షణకు సైతం శ్రీకారం చుట్టామని తెలిపారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యారంగం తిరోగమనంలో పయనిస్తుండటం ఆందోళనకరమని జగన్ అన్నారు. ప్రభుత్వ ప్రచారంలోని డొల్లతనాన్ని ఈ లెక్కలే బయటపెడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

రెండు కోట్ల విత్తన బంతులు వెదజల్లాం

ఎకోపార్క్‌లో మొదటి విత్తన బంతిని తయారు చేశామని.. అప్పటి నుంచి ఇప్పటివరకు 20,929 హెక్టార్ల విస్తీర్ణంలో 2.06 కోట్లకు పైగా విత్తన బంతులు వెదజల్లామని పేర్కొన్నారు. ‘క్షీణించిన అటవీ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పునరుద్ధరించేందుకు వీలుగా డ్రోన్ల సాయంతో ఈ విత్తన బంతులు వెదజల్లుతున్నాం. ఈ సీజన్‌లో 2.82 కోట్ల విత్తన బంతులు చల్లాలని లక్ష్యంగా పెట్టుకోగా.. 85 శాతం మేర లక్ష్యాన్ని సాధించాం. అనంతపురం, కర్నూలు, గుంటూరు, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఈ కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోంది. వెదజల్లిన ప్రాంతాల్లో మొలకల శాతం, మొక్కల ఎదుగుదల తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అటవీ శాఖాధికారులను ఆదేశించాం’ అని పవన్ కల్యాణ్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

కేరళ చేరుకున్న పవన్‌కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శనివారం రాత్రి కేరళ చేరుకున్నారు. త్రిశ్శూర్ సమీపంలోని ఓ ఆయుర్వేద వైద్యశాలలో కుడి భుజానికి చికిత్స చేయించుకోనున్నారు. శనివారం సాయంత్రం కొచ్చి విమానాశ్రయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి.. అక్కడి నుంచి నేరుగా ఆయుర్వేద వైద్యశాలకు వెళ్లారు.

629 ఏఈ పోస్టుల భర్తీకి సర్వం సిద్ధం..

వెల్లడించారు.ఈ పోస్టుల కోసం లక్ష మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని మంత్రి పేర్కొన్నారు. నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ప్రలోభపెట్టే దళారుల మాటలను ఎవరూ నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎవరైనా డబ్బులు ఆశ చూపి మోసం చేయాలని ప్రయత్నిస్తే, బాధితులు నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని కోరారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాల మేరకు, ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తున్నామని గొట్టిపాటి స్పష్టం చేశారు. ఈ నియామకాల ద్వారా విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని

ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా మొక్క నాటిన సయ్యద్ రఫీ





(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 23)

స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరిగా ప్రసిద్ధి చెందిన టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని మార్కాపురం జిల్లా కంభం మండలం లక్ష్మీకోటలో బంగా గ్రీన్ స్పోర్ట్స్‌మన్ ఆఫ్ ఇండియా సయ్యద్ రఫీ మొక్కను నాటారు. 1872 ఆగస్టు 23న ప్రస్తుత ప్రకాశం జిల్లా కనపర్తి గ్రామంలో జన్మించిన టంగుటూరి ప్రకాశం పంతులు చిన్ననాటి నుంచే ధైర్యసాహసాలు, ప్రజాసేవ పట్ల ఆసక్తిని పెంచుకున్నారు. న్యాయవాదిగా వృత్తి ప్రారంభించి అనంతరం స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల్లో ఆయన నిర్భయంగా పోరాడారు. 1928లో మద్రాస్‌లో జరిగిన సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం సందర్భంగా బ్రిటిష్ పోలీసుల తుపాకులకు ఎదురు నిలిచి తన ఛాతీ చూపించిన ధైర్యానికి ఆయనకు ‘ఆంధ్రకేసరి’ అనే బిరుదు లభించింది. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలు, ప్రజల హక్కుల కోసం ఆయన సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. స్వాతంత్ర్యం అనంతరం ప్రజా జీవితంలో కీలక పాత్ర పోషించిన ప్రకాశం పంతులు 1946-48 మధ్య మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, 1953-54లో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా సేవలందించారు. ప్రజా సంక్షేమం, పరిపాలనలో నిజాయితీ, ధైర్యం, నిరాడంబరతకు ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా సయ్యద్ రఫీ మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవితం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. దేశం కోసం పోరాడిన మహనీయుల ఆశయాలను గుర్తుచేసుకుంటూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా ప్రకృతిని కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా మొక్క నాటడం ద్వారా ఆయనకు ఘన నివాళులు అర్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేసినట్లు సయ్యద్ రఫీ తెలిపారు.

డీఎస్సీ పై వైసీపీ నిందలు అవమానకరం

ఎమ్మెల్యే ఏలూరి ఎదుట ఆవేదన వ్యక్తం చేసిన నూతన ఉపాధ్యాయురాలు రత్న కళ్యాణి తల్లిదండ్రులు

తొలి ప్రయత్నంలోనే టీజీటీ బయాలజీగా కొలువు

ఇంటిల్లిపాదికీ ఆనందం

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 23)

డీఎస్సీ నియామకాలపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు, నిందలు మమ్మల్ని ఎంతగానో బాధించాయి. మా కుమార్తె ఎంతో కష్టపడి చదివి.. తొలి ప్రయత్నంలోనే డీఎస్సీలో ఉద్యోగం సాధించింది. అర్హత, ప్రతిభతో కొలువు పొందిన యువత విజయాలను కూడా రాజకీయ విమర్శలకు ముడిపెట్టడం అవమానకరం అని వడ్డేముక్కల రత్న కళ్యాణి తల్లిదండ్రులు అబ్రహాం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. పర్చూరు ఇందిరా కాలనీకి చెందిన వడ్డేముక్కల రత్న కళ్యాణి డీఎస్సీలో టీజీటీ బయాలజీ విభాగంలో ఎంపికై వినుకొండలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా కొలువు సాధించారు. తొలి ప్రయత్నంలోనే ప్రభుత్వ ఉద్యోగం దక్కించుకోవడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

కుమార్తె ఇంట్లో లేకున్నా.. తల్లిదండ్రులతో ముచ్చటించిన ఏలూరి

పర్చూరు పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రత్న కళ్యాణి నివాసానికి వెళ్లారు. అయితే ఉద్యోగ నియామకం కారణంగా ఆమె ఇంట్లో లేకపోవడంతో ఆమె తల్లిదండ్రులను ఆప్యాయంగా పలకరించి కుమార్తె డీఎస్సీ విజయ ప్రస్థానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రత్న కళ్యాణి చదువు, డీఎస్సీకి చేసిన సన్నద్ధత, తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించిన తీరు తదితర వివరాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. తమ కుమార్తె ఎంతో పట్టుదలతో చదివిందని, ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో కష్టపడిందని వారు ఎమ్మెల్యేకు వివరించారు.

కష్టపడి చదివింది.. ఫలితం దక్కింది

మా అమ్మాయి ఉద్యోగం కోసం ఎంతో కష్టపడింది. డీఎస్సీకి సిద్ధమై తొలి ప్రయత్నంలోనే టీజీటీ బయాలజీ ఉద్యోగం సాధించింది. ఆమెకు వచ్చిన ఈ విజయం మాకు ఎంతో గర్వకారణం. ఇలాంటి ప్రతిభావంతుల విజయాలను రాజకీయ కోణంలో చూడటం బాధాకరం అని రత్న కళ్యాణి తల్లిదండ్రులు పేర్కొన్నారు. డీఎస్సీ నియామకాలపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు, ఆరోపణల పై వారు తమ అభిప్రాయాలను ఎమ్మెల్యే ఏలూరితో పంచుకున్నారు. కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన అభ్యర్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా రాజకీయ విమర్శలు ఉండకూడదని వారు అభిప్రాయపడ్డారు.

విజయమే సమాధానం..

కష్టపడి చదివిన యువతకు ఉద్యోగ అవకాశాలు లభించడం సంతోషకరమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. రత్న కళ్యాణి తొలి ప్రయత్నంలోనే డీఎస్సీ సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతిభతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్న యువత విజయాలే డీఎస్సీపై వస్తున్న విమర్శలకు సమాధానమని అన్నారు. రత్న కళ్యాణి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ ఆమె తల్లిదండ్రులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. తమ ఇంటికి ఎమ్మెల్యే వచ్చి కుమార్తె విజయాన్ని అభినందించడం ఎంతో ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు.

ఘనంగా బీనీడి వారి ఆరు గ్రంధాల ఆవిష్కరణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)



ప్రముఖ కవి, సినీ, టీవీ, నాటక రచయిత బీనీడి కృష్ణయ్య రచించిన ఆరు గ్రంధాల ఆవిష్కరణ సభ ఎన్టీఆర్ కళాక్షేత్రంలో సాహితీ మిత్రులు సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు నాగభైరవ ఆదినారాయణ మూడు గ్రంథాలను, నగరపాలక సంస్థ మాజీ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ మూడు గ్రంథాలను ఆవిష్కరించారు. మహాభారతం గ్రంథం పై ప్రముఖ కవి డాక్టర్ బీరం సుందర్‌రావు, మనిషి ఓ మనిషి కవితా సంపుటి పై ప్రముఖ సాహితీ విమర్శకులు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బ్రతుకు ఫలం పై నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు టి అరుణ, దృశ్య కావ్యాలు నాటికల సంపుటి పై ప్రముఖ నటులు, దర్శకులు పిన్ని వెంకటేశ్వర్లు, శ్రీ సద్గురు చరితము పద్య కావ్యం పై అష్టవధాని డివిఎస్ రామాచార్యులు, శ్రీ భాగవతం పై ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు సమీక్ష చేశారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ బీనీడి కృష్ణయ్య 75 సంవత్సరాల జీవితంలో 50 కావ్యాలను ముద్రించటం ప్రకాశంజిల్లాకే గర్వకారణం అని అన్నారు. వీరి జీవితకాలం మొత్తం రచన వ్యాసాంగంపై దృష్టి సారించాలని కోరారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నరపాలక సంస్థ మాజీ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఎందరో రచయితలు, కవులు తెలుగు భాషను పరిపుష్టం చేశారని, తెలుగు భాషకు కీర్తిని తీసుకురావడంలో బీనీడి కృష్ణయ్యలాంటి రచయితల పాత్ర ప్రముఖమైందని ప్రశంసించారు. మహాభారతంపై విశ్లేషణ చేసిన బీరం సుందరావు మాట్లాడుతూ అలతి అలతి పదాలతో భారతంలోని సారాంశాన్ని తన రచనలో పొందుపరిచారని అన్నారు. మనిషి ఓ మనిషి కవితా సంపుటిపై కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ తన కవిత్వంతో సమాజంలోని అసమానతలు, అన్యాయాలపై ధ్వజమెత్తారని అన్నారు. బ్రతుకు ఫలంపై టి.అరుణ మాట్లాడుతూ రచయిత జీవితాన్ని, వారు పడిన కష్టనష్టాలను, ఆటుపోట్లను వివరించారు. దృశ్య కావ్యాలు నాటకాలపై ప్రసంగించిన పిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాటక రచయితగా యజ్ఞఫలం లాంటి అద్భుతమైన సందేశాత్మక నాటకాలను రచించి జాతీయస్థాయి అవార్డులను గెలుచుకున్నారని కొనియాడారు. సద్గురు చరితములోని పద్యాలు కవి భాషా పటిమకు నిదర్శనమని అష్టావధాని డివిఎస్ రామాచార్యులు అన్నారు. శ్రీ భాగవతంపై పొన్నూరు వేంకట శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నో రచనలను చేసినప్పటికీ భాగవత రచన ద్వారా తన సంతృప్తిని రచయిత వ్యక్తం చేశారని అన్నారు. రచయిత బీనీడి కృష్ణయ్య తన స్పందన తెలియజేస్తూ తనకు విద్య నేర్పిన గురువులకు, కవిత్వాన్ని నేర్పించిన పెద్దలకు తన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు బీనీడి కృష్ణయ్య, వెంకట పద్మావతి దంపతులను సత్కరించారు. ముందుగా జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన ఈ సభలో సాహితీ సంస్థల ప్రతినిధులు, తెలుగు భాషాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

24.08.26 సోమవారం

ప్రజల కల సాకారం దిశగా వెలుగొండ ప్రాజెక్ట్

ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు





(షణ్ముఖ వెలుగు, స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 23)

ఈ నెల 31వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి, నీటిని విడుదల చేసి జాతికి అంకితం చేయనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, మార్కాపురం డీఎస్పీ నాగరాజు , వెలిగొండ ప్రాజెక్ట్ అధికారులు, దోర్నాల మండల నాయకులతో కలిసి ఆదివారం సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వెలిగొండ ప్రాజెక్ట్ పనులు, ఫీడర్ కెనాల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా (తరువాయి 4లో...)

టంగుటూరి స్ఫూర్తితో రాష్ట్రం, జిల్లాను అభివృద్ధి చేస్తాం

రాష్ట్ర సాంఘీక, సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 23)

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయ స్ఫూర్తితో జిల్లాను, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి చెప్పారు. ప్రకాశం పంతులు 155వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రకాశం భవనంలోని ఆయన విగ్రహానికి మంత్రితో పాటు కలెక్టర్ పి రాజాబాబు, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, బి ఎన్ విజయ్ కుమార్, రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పి విజయ్ కుమార్, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, ఇతర ప్రముఖులు కలిసి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. 'ఆంధ్ర కేసరి' జీవిత చరిత్రను తెలిపేలా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను వారు తిలకించారు.





అనంతరం ప్రకాశం పంతులు మునిమనవడు టంగుటూరి సంతోష్ కుమార్‌ను వారు శాలువాతో సన్మానించి గౌరవించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఉన్నత విద్యావంతునిగా, స్వాతంత్ర్య పోరాట యోధునిగా, ధైర్యశాలిగా, గొప్ప పరిపాలనాధికారిగా ప్రకాశం పంతులు చూపిన మార్గం అనుసరణీయమన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని మంత్రి పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతికూల పరిస్థితులను అధిగమించి జీవిత ఆశయాన్ని చేరుకోవటంలో ప్రకాశం పంతులు మన అందరికీ దర్శనీయమన్నారు. విద్యార్థి దశలోనూ, స్వాతంత్ర్య పోరాట సమయంలోనూ, ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించడంలోనూ ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్ఫూర్తితో అభివృద్ధి పనులను వేగవంతం వేసామన్నారు. దేవరంపాడులో ఉప్పు సత్యాగ్రహ విజయ స్తూపం, పార్కును అభివృద్ధి చేశామన్నారు. పంతులుగారు గొప్ప వ్యక్తి అని, అందుకే ఆయన పేరు ఈ జిల్లాకు పెట్టినట్లు గుర్తు చేశారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యము కోసం పోరాడుతూనే, సంఘ సంస్కరణల కోసం కూడా కృషి చేశారని చెప్పారు. (తరువాయి 4లో...)

నగరంలో అభివృద్ధి పనులపై యంత్రాంగం దృష్టి

ప్రత్యేకంగా పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 23)

ఒంగోలు నగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను వేగవంతం చేయడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఒంగోలు మునిసిపాలిటీ ఏర్పడి 150 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో నగర సుందరీకరణ, భవిష్యత్తు అవసరాలు తీర్చేలా మౌలిక వసతులు, అభివృద్ధి పనులను చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య ఆదివారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. కిమ్స్ ఆసుపత్రి ఫ్లైఓవర్ వద్ద జోడు ఎద్దుల విగ్రహాలు, పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ప్రత్యేక పైలాన్, గాంధీ పార్కులో ఓపెన్ ఎయిర్ థియేటర్, ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. 14 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శిలాఫలకం ఆవిష్కరణ, పీడీసీసీ బ్యాంకులో చేపట్టిన ఆధునీకరణ పనుల ప్రారంభోత్సవం, మినీ స్టేడియంలో (తరువాయి 4లో...)

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ పరిహారం అందిస్తాం

రాష్ట్ర సాంఘీక, సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 23)

వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ పరిహారం అందిస్తామని రాష్ట్ర సాంఘిక, సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. ఆదివారం ప్రకాశం భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీన 10 టీఎంసీల నీళ్లు వెలుగొండకు ఇస్తామన్నారు. ఆగస్టు నెలాఖరులోగా నీళ్లు ఇస్తామని చెప్పిన మాట ప్రకారం తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో నిర్వాసితులందరికీ పరిహారం అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని, అసత్యాలను నమ్మవద్దని మంత్రి చెప్పారు. 1996 మా 5వ తేదీన నాటి ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. సరిగ్గా 30 ఏళ్ల తర్వాత మళ్లీ చంద్ర బాబు నాయుడే ఈ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి నీళ్లు విడుదల చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. ఇది గొప్ప అదృష్టమని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు (తరువాయి 4లో...)



31న ముఖ్యమంత్రి వెలిగొండ ప్రాజెక్టు పర్యటనను విజయవంతం చేయండి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఆగస్టు 23)

ఈ నెల 31వ తేదీన జరిగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెలుగొండ ప్రాజెక్ట్ పర్యటనను విజయవంతం చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నాయకులకు సూచించారు. ఆదివారం స్థానిక జవహర్ నగర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టు నుండి నల్లమల్ల సాగర్ కు నీటి విడుదల చేయడానికి విచ్చేస్తున్నారని, ఈ సంద ర్భంగా మార్కాపురం నియోజకవర్గంలోని అన్ని మండలాలు, రెండు మున్సిపాలిటీల తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు వేలాదిగా విచ్చేసి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే మార్కా పురం జిల్లా ప్రకటించామని, నియోజక వర్గంలోకి ప్రతి ఇంటికి పైప్లైన్ తీసుకు వచ్చామని, త్వరలో దాన్ని పూర్తి చేసి ప్రతి ఇంటికి కృష్ణానది జలాలను అందిస్తామన్నారు. హార్టికల్చర్ హబ్ ద్వారా మార్కాపురం (తరువాయి 4లో...)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



ప్రజల కల సాకారం దిశగా వెలుగొండ ప్రాజెక్ట్





నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఇతర అంశాల పై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. వెలిగొండ జలాలతో యర్రగొండపాలెం నియోజకవర్గ రైతుల చిరకాల స్వప్నం సాకారం కానున్న ఈ చారిత్రాత్మక ఘట్టానికి నియోజకవర్గ ప్రజలు, రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని వైపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పిలుపునిచ్చారు.

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులందరికీ పరిహారం అందిస్తాం

మరమ్మతులు చేసామన్నారు. మరోవైపు నిర్వాసితులకు రూ.900 కోట్లకు గాను ముఖ్యమంత్రి చేతుల మీదగా ఇప్పటివరకు రూ.768 కోట్లను మూడు విడతలుగా అందించామన్నారు. మిగతా వారికి కూడా పరిహారం ఇస్తామని మంత్రి స్వామి స్పష్టం చేశారు. అపర భగీరథునిలాగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న నదుల అనుసంధానం వంటి అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులందరికీ అందాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలందరూ సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు.

31న ముఖ్యమంత్రి వెలిగొండ ప్రాజెక్టు పర్యటనను విజయంవంతం చేయండి



జిల్లాకి త్వరలో ఐదు వేల కోట్ల నిధులు రాబోతున్నాయని తద్వారా ఈ ప్రాంతం సమూలంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

నగరంలో అభివృద్ధి పనులపై యంత్రాంగం దృష్టి





ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ వంటి కార్యక్రమాలను ఈ వారంలో చేపట్టడం పై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. అవకాశముంటే ఈ నెల 28వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఈ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయించాలని మున్సిపల్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ పర్యటనలో మున్సిపల్ ఇంజనీర్ యేసయ్య, డిఈఈ పద్మజ, ఇతర అధికారులు ఉన్నారు.



టంగుటూరి స్ఫూర్తితో రాష్ట్రం, జిల్లాను అభివృద్ధి చేస్తాం

ధైర్యానికి, త్యాగనిరతికి ప్రతీకగా నిలిచిన మహనీయుని అడుగుజాడల్లో మనమందరం నడవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పివి రమణ, ఒంగోలు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.









ఎస్సైల పై కేసులు నమోదు చేసి సస్పెండ్ చేయాలి నీలం నాగేంద్ర



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఆగస్టు 23)

గంజాయి, మద్యం బాటిళ్లతో పట్టుబడిన సంతమాగులూరు, బల్లికురవ ఎస్ఐలపై బీఎన్ఎస్, ఎన్డీపీఎస్ చట్టాల కింద కేసులు నమోదు చేసి సస్పెండ్ చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం అద్దంకి అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్దంకి ప్రాంతంలోని గ్రానైట్ వ్యాపారులు ఏర్పాటు చేసిన మద్యం విందుకు హాజరై తిరిగి వస్తున్న సమయంలో ఎస్ఐలు ప్రయాణిస్తున్న వాహనం రెడ్డిపాలెం వద్ద ఆటోను ఢీకొన్న ఘటనలో గంజాయి ప్యాకెట్లు, మద్యం బాటిళ్లు లభించాయని నాగేంద్ర పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. ఎస్ఐలు ఇద్దరికీ వెంటనే డోపింగ్ టెస్టులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గుంటూరు ఐజీ స్థాయిలో పూర్తిస్థాయి విచారణ జరపకుండా కేవలం దర్శి డీఎస్పీకి షోకాజ్ నోటీసు ఇవ్వడం సరికాదన్నారు. ఘటనలో ఉన్న పోలీసు అధికారులందరి పాత్ర పై దర్యాప్తు చేయాలని కోరారు. ఎస్ఐలను రక్షించేందుకు ప్రయత్నించిన అద్దంకి సీఐ సుబ్బరాజుకు రివార్డు ఇవ్వాలని వ్యంగ్యంగా పేర్కొన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసు అధికారులే గంజాయి అక్రమ రవాణా ఆరోపణల్లో చిక్కుకోవడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమన్నారు. ఘటన పై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నీలం నాగేంద్ర డిమాండ్ చేశారు. సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకమాను రవి, మాదిగ పరిరక్షణ సమితి కన్వీనర్ అట్రా బంగారం, నీలం మాల సభ కన్వీనర్ మేడికొండ మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలి

ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో గెలిచిన ఎమ్మెల్యేలు, మంత్రులు దీని పై స్పందించాలి సుజన్ మాదిగ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)

ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల దాటుతున్నప్పటికీ, ఈరోజు వరకు ఎస్సీల విషయంలో నిర్లక్ష్యంగా వివరిస్తున్న కూటమి ప్రభుత్వం యొక్క తీరు దారుణంగా ఉందని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుజన్ మాదిగ దుయ్యపట్టారు. ఈరోజు అంబేద్కర్ భవన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడచిన ప్రభుత్వం ఎస్సీల విషయంలో పూర్తిగా విస్మరించిందని అనేక సందర్భాల్లో మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈరోజు వరకు ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల దాటుతున్నప్పటికీ, ఎస్సీ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా కేటాయించడం లేదంటే ఎస్సీల విషయంలో ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏందో అర్థమవుతుందని ఆయన అన్నారు. అదేవిధంగా ఎస్సీ రిజర్వ్డ్ స్థానాల్లో గెలిచిన మాల, మాదిగల పేర్ల మీద ఉన్న శాసనసభ్యులు నోరు మెదపడం లేదంటే, వారు ఈ ప్రభుత్వానికి భయపడుతున్నారా? లేక మాల మాదిగల అంటే చులకనా? ఒకసారి వెల్లడించాలని ఆయన ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో మాల, మాదిగ శాతం, రాష్ట్ర జనాభాలో 18 శాతం అని, ఈ 18 శాతం లో 15 పైగా మాల, మాదిగలు 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఓటు వేశారని, స్వయంగా చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నోరు మెదపాలని సుజన్ మాదిగ అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి ఎస్సీల విషయంలో నోరు మెదపాలని, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడాలని, వీలైనంత తొందరలో ఎస్సీ కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలని సుజన్ మాదిగ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ మాదిగ, సఫాయి చర్మకారుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు త్యాగరాజ మాదిగ, మాదిగ సంక్షేమ పోరాట సమితి బాపట్ల జిల్లా అధ్యక్షులు జయరాజు మాదిగ, అప్పారావు, సింగయ్య మాదిగ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తాం

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 23)

ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా పర్చూరు నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. బోడవాడ, పర్చూరు ఇందిరాకాలనీ, అంబేద్కర్ కాలనీల్లో ఎమ్మెల్యే ఏలూరి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, విద్యుత్ తదితర సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించి.. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ.. వారి సమస్యలకు పరిష్కారం చూపడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా విస్తృత పర్యటన స్థానిక సమస్యలను తెలుసుకుని ప్రజల నుంచి అర్జీల స్వీకరణ బోడవాడ, పర్చూరు ఇందిరాకాలనీ, అంబేద్కర్ కాలనీల్లో పర్యటన

ప్రజల వద్దకే పాలన

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని, వాటి పరిష్కారానికి అందుబాటులో ఉంటానని చెప్పారు. ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం ద్వారా పాలనపై విశ్వాసాన్ని మరింత పెంచుతామని పేర్కొన్నారు.

అభివృద్ధికి పెద్దపీట

నియోజకవర్గంలో రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఏలూరి తెలిపారు. గతంలో పరిష్కారం కాని సమస్యలకు కూడా దశలవారీగా పరిష్కారం చూపుతామని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులకు వేగం పెరిగిందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

పలువురికి ఆత్మీయ పరామర్శ

పర్యటనలో భాగంగా అనారోగ్యంతో బాధపడుతున్న, వివిధ కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురు కుటుంబాలను ఎమ్మెల్యే ఏలూరి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.





వైభవంగా జీర్ణోద్ధారణ





(షణ్ముఖ వెలుగు, కడప, ఆగస్టు 23)
దేవుని కడప శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జీర్ణోద్ధారణ, అష్టబంధన, మహాసంప్రోక్షణ మహోత్సవానికి ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఆగమోక్త వైదిక మంత్రోచ్చారణల నడుమ వాస్తుశాంతి, మృత్సంగ్రహణం, కుంభారాధన, అంకురార్పణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆగస్టు 24న ఉదయం 8 గంటలకు మనోన్మాన ప్రమాణ శాంతి హోమం, కుంభస్థాపన, పంచాగ్ని ప్రణయనం, శాత్తుమొర, సాయంత్రం 6.30 గంటలకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరుగనున్నాయి. ఆగస్టు 25న ఉదయం 7.30 గంటలకు చతుస్థానార్చన, ఏకశీతి కలశ స్నపనం, మూర్తి హోమం, అష్టబంధనం, సాయంత్రం 6 గంటలకు శయ్యాధివాసం, తత్వ హోమాలు, శాంతి హోమం, శాత్తుమొర నిర్వహించనున్నారు. ఆగస్టు 26న ఉదయం 7 గంటలకు చతుస్థానార్చన, మూర్తి హోమం, ప్రాయశ్చిత్త హోమం నిర్వహించి, ఉదయం 9.45 నుంచి 11.30 గంటల వరకు శ్రవణా నక్షత్రం, తులా లగ్నంలో మహా పూర్ణాహుతి, మహాసంప్రోక్షణ, కళాకర్షణ కార్యక్రమాలను ఆగమోక్తంగా నిర్వహించనున్నారు. మహాసంప్రోక్షణ అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఎ ప్రశాంతి, ఏఈవో రవి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా సుగ్రీవ్ వినోద్ ఏకగ్రీవ ఎన్నిక

అనారోగ్యంతో మృతిచెందిన మల్లెంకొండు సుబ్రహ్మణ్యం స్థానంలో బాధ్యతలు

ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఆర్యవైశ్య సంఘం కమిటీప్రతినిధులు

హాజరైన సభ్యులు, దేవస్థాన ట్రస్టీ, మాజీ అధ్యక్షులు



(షణ్ముఖ వెలుగు, జమ్మలమడుగు, ఆగస్టు 23)
కడప జిల్లా జమ్మలమడుగు ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా సుగ్రీవ్ వినోద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జమ్మలమడుగు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఉన్న మల్లెంకొండు సుబ్రహ్మణ్యం అనారోగ్య కారణాలతో అకస్మాత్తుగా మృతి చెందారు.



ఆయన మరణంతో ఖాళీ అయిన అధ్యక్షుడు స్థానానికి, సంఘం సభ్యులు మరియు కమిటీ ప్రతినిధులు ఏకగ్రీవంగా సుగ్రీవ్ వినోద్‌ను నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు చక్రపాణి, ఈసీ సభ్యుడు తన్నీరు సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా హాజరై నూతన అధ్యక్షుడిని అభినందించారు. సంఘ బలోపేతానికి, ఆర్యవైశ్యుల సంక్షేమానికి సుగ్రీవ్ వినోద్ సమర్థవంతంగా కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ట్రస్టీ కర్ణాటి జనార్దన్, సంఘం మాజీ అధ్యక్షులు ఎస్ వి కిషోర్, జె రాధామనోహర్, జి లక్ష్మీనారాయణలతో పాటు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సభ్యులు విశేష సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.

బద్వేలులో మౌలిక సదుపాయాలు కల్పించాలి

పట్టణ అభివృద్ధి పోరాట సొసైటీ హెచ్చరిక




(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఆగస్టు 23)
బద్వేలు మున్సిపాలిటీ ఏర్పడి 15 ఏళ్లు పూర్తయినప్పటికీ, పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన పూర్తిగా వెనుకబడి ఉందని పట్టణ అభివృద్ధి పోరాట సొసైటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆదివారం నాడు సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నానబాల వెంకటేశ్వర్లు, బద్వేలు గురుమూర్తిల అధ్యక్షతన కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా వ్యవస్థలు అధ్వానంగా ఉన్నాయని విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతతో పాటు ఆధునిక వైద్య పరికరాలు లేకపోవడం వల్ల పేద ప్రజలకు వైద్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సొసైటీ నాయకులు పలు ముఖ్యమైన డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. పట్టణంలో పార్కులు, క్రీడా స్టేడియం, కమ్యూనిటీ భవనాలు, లైబ్రరీ భవనాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా తరగతి గదులు, మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించాలి. పట్టణం మధ్యలో ఉన్న నాగులచెరువును పరిశుభ్రం చేసి, దాని మధ్యలో బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్టించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి. పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలాన్ని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలి.
ఇకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా పట్టణాభివృద్ధి శూన్యంగా మారిందని, త్వరలోనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టకపోతే ప్రజలను సమీకరించి బలమైన ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.
నూతన కార్యవర్గం ఎంపిక : సమావేశం అనంతరం సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వి జయరామిరెడ్డి, కార్యదర్శిగా వాలేటి సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా అన్వర్ బాషా, దర్గా సలీంలు లను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి పి శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్ఎ సత్తార్, కెవి సుబ్బారావు, సాకి ఈశ్వరయ్య, జి నాగార్జున, కార్యదర్శులు డాక్టర్ కృష్ణ, తోట రాము, అడ్వకేట్ సురేష్ బాబు, కార్యవర్గ సభ్యులు బి బాలగురన్న, ఆవుల వెంకట్, జమాల్, రసూల్, పివి రమణ, తదితరులు పాల్గొన్నారు.

కులాంతర వివాహం జరిపించిన దళిత నేత నీలం నాగేంద్ర



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)
స్థానిక దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయం వద్ద కమ్మని కులాంతర వివాహాన్ని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు జరిపించారు. ఆదివారం సాయంత్రం కొరిశపాడు మండలం అనుబ్రోలు వారి పాలేనికి చెందిన రావూరి శివనాగలక్ష్మి అను కమ్మ కులానికి చెందిన యువతి కి అదే మండలం ప్రాసంగలపాడు గ్రామానికి చెందిన నూతలపాటి శేషు అను ఎస్సీ మాల కులానికి చెందిన యువకుడి కులాంతర వివాహాన్ని నీలం నాగేంద్రరావు అభినందించారు. రావూరి శివ నాగలక్ష్మి నూతలపాటి శేషులు మూడేళ్లుగా ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలిసిన రావూరి శివ నాగలక్ష్మి అను కమ్మ కులస్తుల బంధువులు తల్లిదండ్రులు ఈ కులాంతర వివాహాన్ని వ్యతిరేకించారు. ఎస్సీ కులానికి చెందిన నూతలపాటి శేషుకు వివాహాన్ని కులం కారణంగా వారి పెద్దలు అంగీకరించలేదు. వేరే పెళ్లి చేస్తామని పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. తాము చెప్పినట్టు పెళ్లి చేసుకోకపోతే చంపేస్తామని శివ నాగలక్ష్మిని బెదిరించారు. ఈ పెళ్లి విషయమై ఊరిలో కూడా పెద్దల పంచాయితీలు జరిగాయి. కానీ కులం కారణంగా యువకుడు ఎస్సీ కులస్తుడనే కారణంతో గ్రామ పెద్దలు సనాతన ధర్మం పాటిస్తూ కులాంతర ప్రేమ వివాహానికి నిరాకరించారు. తప్పనిసరి పరిస్థితుల్లో దళిత యువకుడు నూతలపాటి శేషు బంధువులు ఒంగోలులోని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావుని ఆశ్రయించారు. తమ కులాంతర జంటకు రక్షణ కల్పించాలని తెలుగుదేశం పార్టీ అగ్రకుల పెద్దలు, పోలీసుల నుండి రక్షణ కల్పించాలని కోరారు. కొరిశపాడు రావూరి శివనాగలక్ష్మి కనిపించడం లేదని మిస్సింగ్ కేసు నమోదు చేశారు. చట్టబద్ధంగా మేజర్లైన రావూరి శివ నాగలక్ష్మి, నూతలపాటి శేషు వివాహ జంటను తాము సోమవారం అద్దంకి సర్కిల్ ఇన్స్పెక్టర్ ముందు హాజరు పరుస్తున్నామని నీలం నాగేంద్రరావు దర్శి డిఎస్పి బాలమురళీకృష్ణకు ఫోన్ చేసి తెలిపారు. కులాంతర వివాహ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, మాదిగ పరిరక్షణ సమితి కన్వీనర్ పట్రా బంగారం, నీలం మాల సభ కన్వీనర్ మేడికొండ మురళి, మాల మహానాడు అద్దంకి అధ్యక్షులు కిరణ్ కుమార్, తదితరులు ఉన్నారు.



వలస కూలి దళిత మహిళ పై దాడి చేసిన అగ్రకుల దుర హంకారులను అరెస్టు చేయాలి

దళిత వితంతు మహిళకు రక్షణ కల్పించాలి

ఐయఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ మోహన్ డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 23)
కష్టపడి చేసిన పనికికూలి డబ్బులు అడిగినందుకు దళిత వితంతు మహిళపై పొన్నలూరు మండలం ముప్పాళ్ళ గ్రామంలో అగ్రకుల దుర హంకారులు దాడి చేయడాన్ని ఐఎఫ్‌టియు తీవ్రంగా ఖండించింది. దాడి చేసిన అగ్రకుల దుర హంకారులను వెంటనే అరెస్టు చేయాలని, పొన్నలూరు మండలం వచ్చిన దళిత వలస కూలీలకు రక్షణ కల్పించాలని ఐయఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ మోహన్ డిమాండ్ చేశారు. బాపట్ల మండలం కొండుబొట్ల వారి పాలెంకు చెందిన వితంతు దళిత మహిళ చేబ్రోలు లక్ష్మి జీవనోపాధి కోసం ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం ముప్పాళ్ళ గ్రామానికి వలస వచ్చి పొగాకు పని చేస్తుంది. చేసిన పనికికూలి డబ్బులు ఇవ్వాలని దేవరపల్లి హరికృష్ణారెడ్డిని అడిగినందుకు ఆమె పై ఆయన అనుచరులతో కలిసి దాడి చేసి, కులం పేరుతో దూషించి బెదిరించారు. అగ్రకుల దురహంకారుల దాడిలో గాయపడిన చేబ్రోలు లక్ష్మి బాపట్ల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుందన్నారు. ఈ ఘటన పై పోలీసు ఉన్నతాధికారులు నిష్పాక్షిపాతంగా దర్యాప్తు చేసి బాధితురాలుకు మెరుగైన వైద్య సహాయం అందించి, న్యాయసహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు కూటమిపాలనలో నిరుపేదలు, దళిత మహిళలకు రక్షణ లేకుండా పోతుంది అనేదానికి ఈ ఘటన ఒక నిదర్శనమన్నారు. కుల వివక్ష, దాడులు, బెదిరింపులకు పాల్పడే అగ్రకుల దురంకారుల పై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా చదవటం మా కిష్టం కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)
ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒంగోలు నందు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి 155వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు, కవి, వ్యక్తిత్వ వికాసకులు జాలాది మోహన్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా 1-10-1953 నుండి 15-11-1954 వరకు పని చేశారన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జాతికి చేసిన సేవలకు గుర్తుగా 1972 డిసెంబర్ 5 న ఒంగోలు జిల్లా పేరును ప్రకాశం జిల్లాగా పేరు మార్చారని తెలిపారు. అనంతరం చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా కం టూ లైబ్రరీ ఎవరీ సండే నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం చదవటం మాకిష్టం కార్యక్రమంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రిగా ఆయన దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పోషించిన కీలక పాత్రను, ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి చేసిన సేవలను, ధైర్యసాహసాలకు, దేశభక్తికి ప్రతీకగా నిలిచారని, ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని, ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పంతులు జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది యం శ్రీనివాసులు, డి సందీప్, యం శివ కుమారి, యస్ అనిల్ బాబు, విద్యార్థిని, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

త్యాగాలకు మరో పేరు టంగుటూరి ప్రకాశం పంతులు

టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)
టంగుటూరి ప్రకాశం పంతులు 155వ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో లాయర్‌పేట రైతుబజార్ కూడలి ప్రకాశం పంతులు విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు హాజరై ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రాహ్మణ సేవా సమితి కమ్యూనిటీ హాల్లో బ్రాహ్మణ సేవా సమితి సభ్యులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు గారి దేశభక్తి, త్యాగనిరతి, ప్రజాసేవను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చూపిన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ప్రజల కోసం, దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేతో పాటు బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు, ప్రముఖులు, అభిమానులు మరియు స్థానిక నాయకులు కార్యక్రమంలో పాల్గొని ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుకి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కామరాజు గడ్డ కాశి బాబు, శ్రీకాళహస్తి దేవాలయ సభ్యురాలు కుసుమకుమారి, మద్దులూరి ప్రేమ్ హరినాథ్, ఆదిపూడి వెంకట గిరిజా శాండిల్య, గంజాం రంగనాథ్ ప్రసాద్, మైనంపాటి సాయికుమార్, కొండపాటూరి అప్పాజీ, వంశీ, మారుతి, అద్దంకి రంగారావు, అద్దంకి భువనేశ్వర్, పరమాత్మ నాగేశ్వరరావు, పి నరసింహారావు, కొండేపి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



చిరకాల స్వప్న సహకారమైన రోజు
వయోపరిమితి అంచుకు చేరి...

చివరి అవకాశంలోనే కలను సాకారం చేసుకున్న వీఆర్ఏ
డీఎస్సీ విజేత వీఆర్ఏ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే ఏలూరి
మెగా డీఎస్సీ 2025లో 14వ ర్యాంకుతో
ఉపాధ్యాయుడిగా ఎంపికైన కొప్పుల విజయ్‌కుమార్

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 23)

బోధన వృత్తి పట్ల మనసులో ఎప్పుడో నాటుకున్న కోరిక... ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడ్డా చల్లారని ఆకాంక్ష... వయోపరిమితి గీత దాటిపోతుందేమోనన్న ఆందోళన మధ్య వచ్చిన ఆఖరి అవకాశం... వీటన్నింటినీ అధిగమించి తన చిరకాల స్వప్నాన్ని నిజం చేసుకున్నారు కొల్లావారిపాలెం మాజీ వీఆర్ఏ కొప్పుల విజయ్‌కుమార్. మెగా డీఎస్సీ 2025లో 14వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్)గా ఎంపికైన ఆయన విజయాన్ని అభినందిస్తూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్వయంగా పర్చూరులోని అంబేద్కర్ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిశారు.

వయోపరిమితి అంచున..

చివరి అవకాశంలో విజయం

అంబేద్కర్ నగర్‌కు చెందిన విజయ్‌కుమార్‌కు మెగా డీఎస్సీ-2025 చివరి అవకాశం. దరఖాస్తు సమయానికి ఆయన వయసు 48 సంవత్సరాల 11 నెలలు మాత్రమే. వయోపరిమితికి కేవలం అడుగు దూరంలో ఉన్న తరుణంలో వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న ఆయన, పట్టుదలతో పరీక్షకు సన్నద్ధమయ్యారు. చివరి అవకాశాన్ని సువర్ణావకాశంగా మలచుకుని 14వ ర్యాంకుతో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్)గా ఎంపికై, ముండ్లమూరు మండలం కెళ్లంపల్లిలోని ఎంపీయూపీ పాఠశాలలో పోస్టింగ్ దక్కించుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూనే ఉపాధ్యాయ కల

తండ్రి మరియాదాస్ (దివంగత), తల్లి సువార్తమ్మల కుమారుడైన విజయ్‌కుమార్‌కు ఒక అక్క, ఒక అన్న ఉన్నారు. 2014 ఫిబ్రవరిలో ఏపీపీఎస్సీ పరీక్ష ద్వారా వీఆర్ఏగా ఎంపికైన ఆయన, పర్చూరు రెవెన్యూ పరిధిలోని కొల్లావారిపాలెంలో 11 సంవత్సరాల పాటు సేవలందించారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగుతూనే బోధనా వృత్తిపై తనకున్న మక్కువను వదులుకోకుండా కొనసాగించిన ఆయనకు, మెగా డీఎస్సీ-2025లో వచ్చిన విజయం జీవితంలో ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచింది.

ఇంటిల్లిపాదికీ చదువుల వెలుగు

విజయ్‌కుమార్ భార్య ఆనందకుమారి ఎంఏ, బీఈడీ పూర్తి చేసి ప్రస్తుతం ప్రైవేట్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కుమార్తె సాధిక గుంటూరులోని కిట్స్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. తండ్రి సాధించిన ఈ విజయం కుటుంబ సభ్యులందరికీ మరింత స్ఫూర్తినిచ్చింది.

ఎమ్మెల్యే ఏలూరి సందర్శన... ప్రభుత్వ పనితీరుపై ప్రశంసలు

విజయ్‌కుమార్ నివాసంలో ఆయనతో కాసేపు ఆప్యాయంగా మాట్లాడిన ఎమ్మెల్యే, మెగా డీఎస్సీ నిర్వహణ పారదర్శకంగా ఎలా జరిగిందన్న అంశంపై చర్చించారు. ప్రభుత్వం ఎలాంటి పక్షపాతానికి తావివ్వకుండా, పూర్తి పారదర్శకంగా డీఎస్సీని నిర్వహించిందని, అందుకే విజయ్‌కుమార్ వంటి వేలాది మంది అభ్యర్థులకు న్యాయమైన అవకాశం లభించిందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వైసీపీ నేతల విమర్శలపైనా ఇద్దరి మధ్య చర్చ జరిగింది. వైసీపీ తన అధికార కాలంలో ఐదేళ్లపాటు ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదల చేయకుండా వేలాది మంది నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిందని, ఇప్పుడు అదే పార్టీ నేతలు సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం పారదర్శకంగా జరిగిన డీఎస్సీ ప్రక్రియపై నిరాధార విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఏలూరి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట మేరకు తొలి సంతకంతోనే డీఎస్సీ నోటిఫికేషన్‌కు శ్రీకారం చుట్టారని, కేవలం మూడు నెలల వ్యవధిలోనే నియామక ప్రక్రియను పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. తనకు ఇదే చివరి అవకాశమని, ప్రభుత్వం సకాలంలో డీఎస్సీ నిర్వహించకపోతే వయోపరిమితి దాటిపోయి తన జీవితకాల కల నెరవేరకుండానే మిగిలిపోయేదని విజయ్‌కుమార్ ఎమ్మెల్యే ఏలూరితో ఆవేదనతో కూడిన సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తనలాంటి ఎందరో వయోపరిమితి అంచున ఉన్న అభ్యర్థులకు వరంగా మారిందని పేర్కొన్నారు.

పిజిఆర్ఎస్ సేవల పై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి
జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 23)

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను కోరుతుందన్నారు. పిజిఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పిజిఆర్ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని కలెక్టర్ సూచించారు. క్యూఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పిజిఆర్ఎస్ పోర్టల్‌కు చేరుతుందన్నారు. ఆర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పిజిఆర్ఎస్‌ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పిజిఆర్ఎస్ లో అర్జీలు అందించండి. వాటి పై మీ స్పందన క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



కందుకూరులో మెగా జాబ్ మేళా

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 23)

ఈ నెల 27వ తేదీ గురువారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కందుకూరు నందు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీ, ఐటీఈస్, మాన్యుఫ్యాక్చరింగ్, బీఎఫ్ఎస్ఐ మెడికల్, ఫార్మాస్యూటికల్, రిటైల్, టెలికాలింగ్, తదితర రంగాలకు చెందిన 15 పైగా సంస్థలు పాల్గొంటాయి. 10వ తరగతి, ఇంటర్, బీటెక్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగ మేళాకు హాజరు కావచ్చు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల పురుషులు, మహిళలు, ఫ్రెషర్స్, అనుభవజ్ఞులు అర్హులు, యువతీ, యువకులు ముందుగా నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకుని, జాబ్ మేళాకు హాజరు కావాలి. అభ్యర్థులు తమ బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హత ధ్రువపత్రాలు, అవసరమైన ఇతర పత్రాలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు గోపీకృష్ణ 8897964505, రెహ్మాన్ 9160797311, గోపీనాథ్ 9542970871, ఏపీఎస్-ఎస్‌డీసీ కమాండ్ కంట్రోల్ నంబర్లు 9988853335, 8712655686, 8790118349, 8790117279 నెంబర్లను సంప్రదించాలన్నారు. నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొని ఈ మెగా జాబ్ మేళా ద్వారా అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మద్యం సేవించి మత్తులో బస్సు నడిపిన డ్రైవర్
ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)

ప్రయాణికుల ప్రాణాలతో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు యాజమాన్యాలు ఎలా చెలగాటం ఆడుతున్నాయో తెలిపే ఘటన ఒంగోలులో వెలుగుచూసింది. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మద్యం సేవించి విధులకు హాజరు అయి విజయవాడ నుండి బస్సును డ్రైవింగ్ చేసుకుంటూ ఒంగోలుకు మంగమూరు రోడ్డు జంక్షన్‌కు వచ్చారు ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఒక ప్రయాణికుడు తెలిపిన సమాచారం ప్రకారం వివరాల్లోకి వెళితే.. ఒంగోలు నుంచి చెన్నై వెళ్లాల్సిన ప్రైవేట్ ట్రావెల్స్ ఇంటర్‌సిటీ బస్సు (ఏపీ 02 జజ 8512) శనివారం రాత్రి 11.45 గంటలకు బయలుదేరాల్సి ఉంది. అయితే బస్సు డ్రైవర్ మద్యం మత్తులో ఉండటాన్ని గుర్తించిన ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి రెండు గంటలు దాటినా బస్సు కదలకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. బస్సు ఆలస్యంపై నిర్వాహకులను ప్రయాణికులు ప్రశ్నించగా.. డ్రైవర్‌ను మార్చుతామని, మరో డ్రైవర్ వచ్చే వరకు వేచి చూడాల్సిందేనని సమాధానం ఇచ్చినట్లు ప్రయాణికులు తెలిపారు. విజయవాడ నుంచి ఒంగోలు వచ్చిన ఈ బస్సు డ్రైవర్ అక్కడి నుంచే మద్యం సేవించాడా? లేక మార్గమధ్యలో తాగాడా? అనే విషయంపై స్పష్టత లేదని ప్రయాణికులు పేర్కొన్నారు.

ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ఇలాంటి నిర్లక్ష్యానికి పాల్పడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడానికి సిద్ధమైన డ్రైవర్‌తో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు.







స్ఫూర్తిదాయకంగా బాలవిహార్ శిక్షణా తరగతులు
శ్రీ గిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)

విద్యార్థులలో చిన్నప్పటి నుంచే దేశ భక్తి దైవభక్తి క్రమశిక్షణ నైతిక విలువలు నియమ నిష్ఠలు సదాచారం సంస్కృతి సంప్రదాయాల పట్ల అనురక్తి పెద్దలను గౌరవించడం సన్మార్గంలో పయనించడం వ్యక్తిత్వ వికాసం కలిగిన వారిగా తీర్చి దిద్దడం వంటి సమున్నత లక్ష్యాలతో సంవత్సరం క్రితం చిన్మయ మిషన్ తోడ్పాటుతో శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రారంభించిన శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులు ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయని శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి దేవస్థానం గో క్షేత్ర భవన్ లో నిర్వహిస్తున్న శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులను శ్రీనివాస చరణ రాజీవ్ శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణితో కలిసి పరిశీలించారు. శ్రీగిరి చిన్మయ బాల విహార్ విద్యార్థులు భగవద్గీతలోని భక్తి యోగం శ్లోకాలను క్షుణ్ణంగా నేర్చుకుని భగవద్గీత కంఠస్థ పోటీలలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తించి చిన్మయ మిషన్ ప్రబోధకులు సత్యాత్మా నంద స్వామిని అభినందించారు. త్వరలో శ్రీ గిరి చిన్మయ బాలవిహార్ విద్యార్థులకు భజన సంకీర్తనలు కూడా నేర్పేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగేలా
రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి
జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)

ప్రజల్లో సంతృప్తిస్థాయి పెరిగేలా రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. ఆదివారం ప్రకాశం భవనంలో నిర్వహించిన రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్ లో ఆయన వివిధ అంశాల పై దిశానిర్దేశం చేశారు. రీ సర్వే, ఈ-కేవైసీ, గ్రౌండ్ ట్రూటింగ్, మ్యుటేషన్లు, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, రెవెన్యూ గ్రీవెన్స్ అర్జీలు, ఐవిఆర్ఎస్ సర్వేలో సానుకూల అభిప్రాయం పెంపు తదితర అంశాలపై మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలను పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని, అర్జీదారులతో దురుసుగా ప్రవర్తిస్తే ఊరుకోనని హెచ్చరించారు. ముఖ్యంగా రీసర్వే కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలని, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ 80 శాతానికి పైగా పూర్తి కావాలని, గ్రీవెన్స్ అర్జీలను, సేవలు అందుతున్న తీరుపై ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవిఆర్ఎస్ సర్వేలను సీరియస్ గా తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం వీటికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నందున అర్జీదారులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సదస్సులో డిఆర్ఓ పివి రమణ, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, ఒంగోలు, అద్దంకి ఆర్డీవోలు చంద్రశేఖర్ నాయుడు, విజయ జ్యోతి కుమారి, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రొయ్యల రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం రైతు సంఘం నాయకులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)
ఉమ్మడి ప్రకాశం జిల్లా రైతు సంక్షేమ సంఘం, రాష్ట్ర రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులోని వి గ్రాండ్ హోటల్లో రొయ్యల రైతుల కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు భగవాన్ రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులకు రూపాయల కరెంటు గురించి, డీకే భూములు సంబంధించి సర్టిఫికెట్లు లేకుండా బయోటేగ్ తో సబ్సిడీ కొరకు గురించి అలాగే ఫీడ్ ధరలు నాణ్యమైన సీడ్ గురించి చర్చించడం జరిగింది రైతుల సమస్యలపై ఇప్పటివరకు గవర్నమెంట్ లతో జరిగిన చర్చలు వివరాలు తెలియ పరచడమైనది అలాగే ఎస్సీఎల్ సెంట్రల్ గవర్నమెంట్ సహకారంతో రొయ్య రైతులు నేరుగా అమ్ముకోవడం గురించి రైతు సంఘాలుగా ఏర్పడటం గురించి సమావేశంలో మాట్లాడారు ఈ కార్యక్రమంలో రామలింగ రాజు, సత్తిబాబు రాజు, ప్రకాశం జిల్లా అధ్యక్షులు యశ్వంత్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిల్లర్ రవికుమార్, సత్యం రాజు, కోశాధికారి కృష్ణమూర్తి, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు

కలియుగ వరదుడు దత్తాత్రేయుడు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)
కలియుగములో భక్త జనులను ఉద్ధరించుట కొరకు సాక్షాత్తు త్రిమూర్తి స్వరూపంగా దత్తాత్రేయ స్వామి అవతరణ జరిగినదని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ఐ మురళీకృష్ణ తెలిపారు. స్థానిక సంతపేటలో వేంచేసి ఉన్న భగవాన్ శ్రీశ్రీశ్రీ గొలగమూడి వెంకయ్య స్వామి వారి 44వ ఆరాధన మహోత్సవాల భాగంగా ఏర్పాటు చేసిన దత్త సాంప్రదాయం అనే అంశంపై ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ఉపన్యాసంలో ఆయన మాట్లాడుతూ కలియుగంలో సమస్త మానవాళి ఆధ్యాత్మిక ఉద్ధరణ నిమిత్తం లోక కళ్యాణం కోసం మహా పతివ్రత అనసూయ అత్రి మహాముని కుమారునిగా దత్తాత్రేయ స్వామి అవతరించడం జరిగిందని పేర్కొన్నారు. వేద స్వరూపమైన ఉపనీషత్తులలో 108వది అయిన ముక్తి కోపనిషత్తు మరియు సన్యాసపనిషత్తులలోదత్త సంప్రదాయానికి చెందిన అవధూతల జీవిత రహస్యాలకు సంబంధించినపలు అంశములు మనకు లభ్యం అవుతున్నాయని సోదాహరణముగా వివరించారు. జగత్కళ్యాణం కోసం అవతరించిన భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి బోధనలు లీలలు సర్వ మానవాళి ఆధ్యాత్మికఉన్నతికి మార్గదర్శకాలని పేర్కొన్నారు. తదనంతరం మందిర నిర్వాహకులు ఆవుల ఆంజనేయులు సభ్యులు ప్రవచకులు మురళీకృష్ణ ను ఘనంగా సత్కరించారు. తదనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగినది. నేటి కార్యక్రమాల్లో భాగంగా శ్రీ స్వామివారికి ఉదయం అభిషేకం విశేష దుని పూజ, ప్రత్యేక హారతి, విశేష అన్నదాన సంతర్పణ కార్యక్రమం, సాయంత్రం పర్వతరావుచే ఆధ్యాత్మిక ఉపన్యాసం జరుగుతాయని కావున భక్తులుపై కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి దివ్య అనుగ్రహఆశీస్సులు పొందాలని నిర్వాహకులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల ముసాయిదా ప్రచురణ



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 23)
స్థానిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా 2026 గ్రామ పంచాయతీలకు నిర్వహించే 2 వ సాధారణ ఎన్నికలకోసం చిన్నగంజాం మండలం లోని 12 గ్రామ పంచాయతీలలో ఉన్న 132 పోలింగ్ కేంద్రాల
పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ కే ధనలక్ష్మి ప్రచురించారు. ప్రతి పంచాయతీ పోలింగ్ కేంద్రంల్లో ముసాయిదా జాబితాను ప్రచరణ వుంటుందని ఈ సందర్భంగా అమే తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ విజేత అలీముద్దీన్ ఇంటికి ఎమ్మెల్యే సాంబన్న

నాలుగో ప్రయత్నంలో ఫలించిన ఉపాధ్యాయ కల

తండ్రి లేని లోటు, తల్లి ఆసరా...

కష్టాల కడలి దాటి గెలుపు తీరం చేరిన వైనం

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 23)
బాల్యంలోనే తండ్రిని కోల్పోయి, తల్లి ఒడిలో పెరిగిన ఓ యువకుడు... కడు పేదరికంలోనూ చదువుపై మమకారం వీడని మనోబలం... మూడుసార్లు విఫలమైనా వెరవని పట్టుదల... ఎట్టకేలకు నాలుగో ప్రయత్నంలో దక్కిన ఉపాధ్యాయ ఉద్యోగం. ఉప్పుటూరుకు చెందిన షేక్ అలీముద్దీన్ జీవితం ఎందరో యువ ఉద్యోగార్థులకు ఆదర్శంగా నిలుస్తోంది. మెగా డీఎస్సీ-2025లో స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్)గా ఎంపికై, బల్లికురవ మండలం కొప్పెరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధుల్లో చేరిన ఆయనను అభినందించేందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్వయంగా అలీముద్దీన్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో ఆయన ముచ్చటిస్తూ, తన ఉద్యోగ ప్రయాణాన్ని, మెగా డీఎస్సీపై తన అభిప్రాయాలను వివరించారు.

నాలుగో ప్రయత్నానికి దక్కిన ఫలం
42 ఏళ్ల అలీముద్దీన్ 2012, 2014, 2018 డీఎస్సీల్లో ప్రయత్నించి విఫలమయ్యారు. అయినా ఆశయాన్ని వదులుకోకుండా, పట్టువదలని విక్రమార్కుడిలా మరోసారి బరిలో నిలిచి, 2025 మెగా డీఎస్సీలో తన నాలుగో ప్రయత్నంలో విజయం సాధించారు. ఏళ్ల తరబడి రకరకాల ఉద్యోగాలు చేసుకుంటూనే ఉపాధ్యాయ వృత్తిపై తనకున్న మక్కువను వదులుకోలేదని, ఎట్టకేలకు జీవితకాల ఆశయమైన టీచర్ పోస్టు దక్కిందని ఎమ్మెల్యేతో అలీముద్దీన్ చెప్పారు.

ఎలాంటి అక్రమాలు జరగలేదు : అలీముద్దీన్
మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ ఎంతో పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సాగిందని అలీముద్దీన్ స్పష్టం చేశారు. ఏళ్లతరబడి కష్టపడి చదివిన మేధావులకు, ప్రతిభావంతులైన అభ్యర్థులకే ఈ డీఎస్సీలో ఉద్యోగాలు దక్కాయని తెలిపారు. తాను స్వీయ ప్రతిభతోనే ఉద్యోగం సాధించానని, అయినప్పటికీ కొందరు రాజకీయ కారణాలతో దీన్ని కించపరిచేలా మాట్లాడటం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

విమర్శల పై అసంతృప్తి...
అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా, ఉద్యోగార్థులను మానసికంగా కుంగదీసిన గత వైసీపీ ప్రభుత్వానికి... నేటి మెగా డీఎస్సీపై విమర్శించే అర్హత లేదని అలీముద్దీన్ వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీపైనే పెట్టి, కేవలం మూడు నెలల్లోనే నియామక ప్రక్రియను పూర్తి చేసి నియామక పత్రాలు అందజేశారని కొనియాడారు. ప్రస్తుత ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో 90 శాతం మంది గతంలో చంద్రబాబు హయాంలో జరిగిన డీఎస్సీల ద్వారానే ఉద్యోగాలు పొందారని, ఇప్పటివరకూ జరిగిన అన్ని డీఎస్సీలు పారదర్శకంగానే సాగాయని పేర్కొన్నారు.



మంత్రి లోకేష్ చొరవను అభినందిస్తూ...
విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడి, మూడు నెలల్లోనే నిష్పక్షపాతంగా, వేగంగా నియామక ప్రక్రియ పూర్తయిందని ఎమ్మెల్యే ఏలూరి తో అలీముద్దీన్ కృతజ్ఞతాపూర్వకంగా తెలిపారు. తమలాంటి ఎందరో అభ్యర్థుల కుటుంబాల్లో ఈ డీఎస్సీ ద్వారా ఆనందం నింపిందని, తమ జీవితం సార్థకమైందని భావిస్తున్న తరుణంలో... రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని విమర్శించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు తమ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పదో తరగతి ప్రతిభావికి రూ.1.15 లక్షల ఆర్థిక సాయం

బద్వేల్ పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు ఎద్దుల రామసుబ్బారెడ్డి అభినందనలు

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఆగస్టు 23)
స్థానిక పెన్షనర్స్ కార్యాలయము నందు బద్వేల్ పెన్షనర్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో లెక్కల ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన విశ్రాంత ఉద్యోగుల సమావేశం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో అమగంపల్లి వద్దగల బాలమ్మ సత్రం అనాధ శరణాలయంలో నివసిస్తున్న ఒక దివ్యాంగ (మూగ) మహిళ కుమారుడు శ్రీ యానం జూన్ శరత్ పదవ తరగతిలో 600 మార్కులకు గాను 593 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచినందుకు, ఆ పేద విద్యార్థి ఉన్నత విద్య కోసం పెన్షనర్స్ సేవా సంస్థ, అమ్మ ఒడి పూర్వ విద్యార్థులు, నారాయణ విద్యాసంస్థల సీఈఓ రామ మోహన్‌రెడ్డి సంయుక్తంగా రూ.1,15,000 ఆర్థిక సహాయాన్ని అందించారు.
ఈ మొత్తం సాయంలో నారాయణ విద్యాసంస్థల సీఈఓ రామ మోహన్‌రెడ్డి ఫీజులో సుమారు రూ.40,000 రాయితీ అందించగా, మిగిలిన రూ.75,000 మొత్తాన్ని చెక్కు రూపంలో విద్యార్థికి అందజేశారు.
ఎద్దుల రామసుబ్బారెడ్డి ప్రత్యేక అభినందనలు:
ఈ సందర్భంగా బద్వేల్ పెన్షనర్స్ సంఘ అధ్యక్షులు ఎద్దుల రామసుబ్బారెడ్డి పాల్గొని ప్రసంగించారు. తీవ్ర ప్రతికూల పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పదో తరగతిలో 593 మార్కులు సాధించిన జూన్ శరత్ పట్టుదలను, కృషిని ఆయన ముక్తకంఠంతో కొనియాడారు. విద్యార్థిని ప్రత్యేకంగా అభినందిస్తూ, రాబోయే రోజుల్లో కూడా ఇదే పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే బద్వేల్ పెన్షనర్స్ సేవా సంస్థ చేస్తున్న సామాజిక సేవలను ఎద్దుల రామసుబ్బారెడ్డి శ్లాఘించారు. పేద విద్యార్థులకు, సమాజంలో వెనుకబడిన వారికి చేయూతనందించడంలో సేవా సంస్థ ముందుండటం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోరి సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్తులో కూడా ఇటువంటి మరెన్నో ఉత్తమమైన సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని, విద్యార్థులకు మరింత ప్రోత్సాహం అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా పెన్షనర్స్ సంఘ అధ్యక్షులు ఎన్ రామ్మూర్తి నాయుడు, కార్యదర్శి వి నాగముని రెడ్డి, కోశాధికారి ఎన్ నగేష్, బాలమ్మ సత్రం సిస్టర్ రోజీ మేడమ్, వారి సిబ్బంది, బద్వేలు నారాయణ కాలేజ్ ప్రిన్సిపల్, బద్వేల్ పెన్షనర్స్ సేవా సమితి, సంస్థ కార్యవర్గ సభ్యులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ బద్వేలు పెన్షనర్స్ సేవా సంస్థ తరఫున పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు.







పేకాట శిబరంపై దాడి ఆరుగురు అరెస్టు



(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, ఆగస్టు 23)
మండలంలోని సిద్దవరం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బంది కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.2,540 నగదు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.
ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు

విగ్రహానికి శంకుస్థాపన

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)
ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం పేర్నమిట్ట వద్ద ఉన్నటువంటి విశ్వవిద్యాలయ బిల్డింగ్స్ వద్ద ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు యొక్క విగ్రహ ఆవిష్కరణకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు, అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగింది.



పర్చూరులో బంద్, ధర్నాలు, నిరసన కార్యక్రమాలకు పోలీస్ అనుమతి లేదు



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 23)
బాపట్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, పర్చూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆగస్టు 24న ఎటువంటి బంద్, ధర్నా, ర్యాలీ, నిరసన లేదా ఇతర ప్రజా కార్యకలాపాలకు పోలీస్ శాఖ అనుమతి ఇవ్వలేదని పర్చూరు ఎస్ఐ పులి గోపి తెలిపారు. ఇ సందర్భంగా ఎస్ఐ పులి గోపి మాట్లాడుతూ పర్చూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, దుకాణాలు మరియు ఇతర సంస్థలు యథావిధిగా తమ సాధారణ కార్యకలాపాలను కొనసాగించాలని ఎటువంటి బలవంతపు బంద్‌కు సహకరించరాదని కోరారు. పోలీస్ అనుమతి లేకుండా బంద్, ధర్నా, ర్యాలీ, రోడ్డుపై నిరసన కార్యక్రమాలు నిర్వహించడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించడం లేదా ఇతరులను బలవంతంగా సంస్థలు మూసివేయించే ప్రయత్నం చేయడం చట్టపరమైన చర్యలకు దారితీస్తుందని తెలిపారు.పర్చూరు పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎటువంటి వదంతులను నమ్మకుండా, చట్టాన్ని గౌరవిస్తూ తమ రోజువారీ కార్యకలాపాలను ప్రశాంతంగా కొనసాగించాలని సూచించారు. అదే విధంగా, సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే సందేశాలు లేదా ప్రజల్లో భయాందోళనలు కలిగించే ప్రచారం చేయవద్దని పోలీసులు హెచ్చరించారు.పోలీస్ అనుమతి లేకుండా ఎలాంటి నిరసన కార్యక్రమాలు నిర్వహించినా, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మండలంలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్
19 ద్విచక్ర వాహనాలు, 3 అటోలు సీజ్





(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 23)
మండలంలోని చిన్నగంజాం పంచాయతీ మహాలక్ష్మి మరియు రామకోటేశ్వర కాలనీల్లో ఇంకోల్లు సర్కిల్- ఇన్స్పెక్టర్ అధ్వర్యంలో పోలీసులు విస్తృత స్థాయిలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఓ సందర్భంగా ఉదయం 5గంటల నుండే పదుల సంఖ్యలో పోలీసులు ఇంటింటికి వేళ్ళి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని 16 ద్విచక్రవాహనాలు, 3అటోలు అధిక మొత్తంలో మద్యంను సీజ్ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ ఇ కార్డెన్ సెర్చ్ ద్వారా అక్రమ కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యమని తెలిపారు.ఇ కార్యక్రమంలో మండల మరియు ఇంకోల్లు సర్కిల్ పోలీసులు పాల్గొన్నారు

అమరావతి గ్రౌండ్‌లో ఘనంగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 23)
స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం అమరావతి గ్రౌండ్ నందు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సైమన్ కమిషన్‌కు ఎదురొడ్డి నిలిచిన ధీరోదాత్తుడు, నిస్వార్థ నాయకుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని కొనియాడారు. స్వరాజ్య పోరాటంలో టంగుటూరి చూపిన ధైర్యసాహసాలు, త్యాగం నేటి తరానికి ఆదర్శనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

యశస్విని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఘనంగా ఉచిత మెగా వైద్య శిబిరం



(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 23)
పట్టణంలోని యశస్విని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి సుమారు 300 మంది హాజరై ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల నుంచి సలహాలు, సూచనలు పొందారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ వైద్య విభాగాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొన్నారు. సాధారణ వైద్యం, క్యాన్సర్, గైనకాలజీ, చిన్నారుల వైద్యం తదితర విభాగాల్లో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ షర్మిల మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య పరీక్షలు, నిపుణుల సలహాలు ఉచితంగా అందించడం ద్వారా ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించడంతో నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.

వెలిగొండ పై బైక్ ర్యాలీ



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 23)
పశ్చిమ ప్రాంత ప్రజల కల సాకారమవుతున్న సందర్భంగా కనిగిరి నియోజకవర్గంలో సోమవారం కూటమి శ్రేణులు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలు నిర్వహించనున్నారు. వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 31న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నీటిని విడుదల చేసి ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. గత ఎన్నికల్లో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి 5 ప్రధాన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అందులో వెలిగొండ ప్రాజెక్టు కూడా ఒకటి. వెలిగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనుండడంతో కనిగిరి ప్రాంతంలో ప్రాజెక్టు ప్రారంభం పై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు కూటమి శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం హైవేలోని కొత్తూరు వద్ద గల ఆంజనేయస్వామి ఆలయం నుండి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని టిడిపి నాయకులు తెలిపారు. పట్టణంలోని పామూరు బస్టాండ్‌లోని చర్చి, ఒంగోలు బస్టాండ్‌లోని మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పట్టణంలోని ప్రధాన వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఈ బైక్ ర్యాలీ పీసీపల్లి మండలం పాలేటిగంగమ్మ వరకు జరుగుతుందని పార్టీ నాయకులు తెలిపారు. కనిగిరిలోని చర్చి సెంటర్‌లో, పీసీపల్లి మండల కేంద్రంలో వెలిగొండ ప్రారంభం పై సభలు నిర్వహిస్తున్నట్లు పార్టీ అధ్యక్షులు కొండా కృష్ణారెడ్డి, ఏనుగంటి శ్రీనివాసులు, షేక్ ఫిరోజ్‌లు తెలిపారు. ఈ బైక్ ర్యాలీని పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, రైతులు విజయవంతం చేయాలని వారు కోరారు.



ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులుకు ఘన నివాళులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 23)
స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి బిరుదాంకితుడు స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి నాగేశ్వరరావు ,పోలీస్ అధికారులు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన అర్పించి, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎఆర్ అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23 న ప్రకాశంజిల్లా, నాగులుప్పలపాడు మండలం, వినోదరాయుని పాలెము గ్రామంలో సుబ్బమ్మ, గోపాల కృష్ణయ్య దంపతులకు జన్మించారని, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడినప్పటికీ, పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించారు. లండన్ లో బారిస్టర్ పాసై ప్రముఖ న్యాయవాదిగా సేవలందించారని, కేవలం ఒక న్యాయవాదిగా మాత్రమే కాకుండా, మద్రాస్ లో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో బ్రిటీషర్ల తుపాకీకెదురుగా గుండె చూపించి ఆంధ్రకేసరిగా చిరస్థాయిగా నిలిచారని, నిబద్ధత, ధైర్యం, సమైక్యతకు నిదర్శనంగా బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాడి స్వతంత్ర పోరాటంలో చురుకైన పాత్ర పోషించారు. ప్రకాశం పంతులు ఆంధ్ర రాజకీయాలలో వెలుగొందిన వ్యక్తులలో ప్రముఖుడని, ప్రత్యేకంగా రాష్ట్ర సాధనలో నిర్ణయక పాత్ర పోషించాడని, 1953 అక్టోబర్ 1న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా ప్రజాసేవకుడయ్యారని, ఆయన జాతికి చేసిన సేవలను గుర్తుగా 1972 డిసెంబర్ 5న ఒంగోలు జిల్లా పేరును ప్రకాశం జిల్లాగా మార్చారని, అలాంటి మహనీయులైన ప్రకాశం పంతులు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీతారామరెడ్డి, ఆర్ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పిలుపుతో గ్రామీణ ప్రాంతాలకు చేరువైన ఉచిత వైద్యం
వనిపెంటలో వైభవంగా ఉచిత మెగా వైద్య శిబిరం
ప్రజా ఆరోగ్యమే ధ్యేయంగా ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ కృషి
నాయకులు తమ్మిశెట్టి చిన్న సుబ్బరాయుడు








(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 23)
మైదుకూరు నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక సూచనలు, మార్గదర్శకత్వంలో వనిపెంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం అత్యంత వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే పిలుపు మేరకు టిడిపి నాయకులు తమ్మిశెట్టి చిన్న సుబ్బరాయుడు ఈ కార్యక్రమాన్ని ముందుండి పర్యవేక్షించి దిగ్విజయం చేశారు. నియోజకవర్గంలోని ప్రతీ పేద కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందాలనే సంకల్పంతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఇటువంటి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు నిపుణులైన వైద్యుల సేవలను పొందేలా ఎమ్మెల్యే అందించిన ప్రోత్సాహం అభినందనీయమని కొనియాడారు. ఈ శిబిరంలో పాల్గొన్న వందలాది మంది గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురికి నిపుణులైన వైద్యులతో అవసరమైన ఆరోగ్య సలహాలు అందించారు. గ్రామీణ పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వైద్యాన్ని తమ గుమ్మం ముందుకు తెచ్చిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కి వనిపెంట గ్రామ ప్రజలు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే నాయకత్వంలో నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ ముందుకు సాగుతోందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నందలూరు, ఇరగంరెడ్డి కుటుంబాల కళ్యాణ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి
నూతన వధూవరులను ఆశీర్వదించిన వైసీపీ నేతలు



(షణ్ముఖ వెలుగు, దువ్వూరు, ఆగస్టు 23)
దువ్వూరులోని దేవాన్ష్ కళ్యాణ మంటపంలో శనివారం నందలూరు, ఇరగంరెడ్డి కుటుంబాల కళ్యాణ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ వివాహ మహోత్సవానికి మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దువ్వూరు మండల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దువ్వూరు మండలం అన్నపుశాస్త్రులపల్లె గ్రామానికి చెందిన నందలూరు వెంకట సుబ్బారెడ్డి, నారాయణమ్మల కుమారుడు నరేష్ కుమార్‌రెడ్డి, గుడిపాడు గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి పెద్దిరెడ్డి, లక్ష్మిదేవిల కుమార్తె చంద్రకళల వివాహ వేడుకల్లో వైఎస్ఆర్సీపీ నేతలు పాల్గొని, నూతన వధూవరుల పై అక్షింతలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. వధూవరులు కలకాలం సుఖసంతోషాలతో, చూడముచ్చటైన జంటగా వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు గోపిరెడ్డి బాబు, వైఎస్ఆర్సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ వహాబ్, వైఎస్ఆర్సీపీ నాయకులు గుర్రంపాటి శంకర్ రెడ్డి, ఇరగంరెడ్డి పద్మనాభరెడ్డి, పుత్తా శ్రీనివాస్ రెడ్డి, చింతకుంట సుబ్బారెడ్డి, బోరెడ్డి కొండారెడ్డి, వివి స్వామి, వీరభద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com